సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



దశాబ్దాలుగా చీకట్లోనే
పశ్చిమ ఏజెన్సీలోని నాగరిక జీవనానికి దూరంగా ఉంటున్న గ్రామం మోదేలు. ఐటీడీఏ వీరి జీవితాల్లో వెలుగులు నింపలేకపోయింది. 8లో ▸



వైభవం.. నవనారసింహ హోమం
సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో సోమవారం నారసింహుని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 8లో ▸



పట్టిసంలో ఏర్పాట్లు పూర్తి
పట్టిసంలో మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తయ్యాయి. అధికారులు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. 8లో ▸

న్యూస్‌రీల్

పంచారామ క్షేత్రంలో ఏర్పాట్ల పరిశీలన



శివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ వి.భీమారావు

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామ క్షేత్రంలో శివరాత్రి మహోత్సవాల ఏర్పాట్లను సోమవారం జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావుతో కలిసి పరిశీలించారు. స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు టాయిలెట్స్, మంచినీళ్ల సౌకర్యం ఉండాలని జాయింట్ కమిషనర్ సూచించారు.

చిరుపొట్ట దశలో అప్రమత్తంగా ఉండాలి



వరి పరిశోధనా స్థానంలో మాట్లాడుతున్న సహ సంచాలకుడు డాక్టర్ ఎస్ దయాకర్

పెనుమంట్ర: జిల్లాలో వరిసాగు చిరుపొట్ట దశలో ఉందని, చాలా ప్రాంతాలలో జింకు లోపం, సల్ఫెడ్ విష ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నాయని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి సహ సంచాలకులు డాక్టర్ ఎస్.దయాకర్ అన్నారు. సోమవారం మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో శిక్షణ, సందర్శన వర్క్‌షాపు నిర్వహించారు. సల్ఫెడ్ విష ప్రభావం ఉన్న ప్రాంతాలలో సల్ఫర్ ధాతువు కలిగిన 20-20-0-13, అమ్మోనియం సల్ఫేట్ వంటి ఎరువులు వాడకుండా అవగాహన కల్పించారు. ఎంటీయూ 1426 గుణగణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన సమాచారాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలకు తెలియజేయాలని కోరారు. ఎంటీయూ 1424 ప్రస్తుతం పిలకలు కట్టే దశలో ఉందని, ప్రస్తుతానికి చీడపీడలు ఆశించడంలేదని పలువురు వ్యవసాయ అధికారులు శిక్షణలో వివరించారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి



భీమవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వీరరాఘవులు

భీమవరం: నైతిక విలువలతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండలిలో ప్రశ్నించే పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని పలు సంఘాల నాయకులన్నారు. వీరరాఘవులు భీమవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, లాయర్ల సంఘాలు, దళిత సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. భీమవరం బార్ అసోసియషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో నైతిక విలువలు, నీతి నిజాయతీలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ అట్టడుగు వర్గంలో పుట్టిన వీరరాఘవులు తన 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఉద్యమాల బాట పట్టి సమాజ శ్రేయస్సుకు తన వంతు కృషి చేశారని అలాంటి వ్యక్తిని గెలిపిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్‌వి గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.విజయ రామరాజు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ దేవస్థానం హుండీలను సోమవారం లెక్కించగా రూ. 91,95,041 ఆదాయం లభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, ఈవో బుద్ద మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. 46 రోజులకు ఈ ఆదాయం లభించినట్లు తెలిపారు. 69 గ్రాముల బంగారం, 315 గ్రాముల వెండి లభించినట్లు తెలిపారు.

ఫలితం పదిలమేనా?

- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- 24,909 మంది విద్యార్థుల హాజరు
- 135 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- కొన్ని చోట్ల సకాలంలో పూర్తికాని సిలబస్, ఆలస్యంగా అందిన బుక్‌లెట్లు



సాక్షి, భీమవరం: మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు మొదలుకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 24,909 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరికోసం 135 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పదిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ దిశానిర్దేశం చేసింది. క్షేత్రస్థాయిలో అందుకు అనువైన పరిస్థితుల కల్పన చేయకపోవడం విద్యాశాఖ అధికారులకు సవాలుగా మారింది. ఈ విద్యా సంవత్సరంలో సిలబస్ మార్పు చేశారు. అయితే ప్రభుత్వం సకాలంలో పుస్తకాలను పాఠశాలలకు అందజేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. చాలావరకు ప్రైవేట్ పాఠశాలల్లో ముందుగానే 10వ తరగతి క్లాసులు ప్రారంభించి అక్టోబరు నాటికే సిలబస్ పూర్తిచేసి రివిజన్ ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబరు వరకు సిలబస్ కొనసాగింది. విద్యార్థులపై ఒత్తిడి పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించినా వందరోజుల రోజుల కార్యాచరణ ప్రణాళికను విద్యా శాఖ అమలు చేసింది. గతంలో సిలబస్ పూర్తయిన తర్వాత నుంచి ప్రత్యేక ప్రణాళికలను అమలుచేసేవారు. మరోపక్క అన్ని సబ్జెక్టులలో ముఖ్యమైన ప్రశ్నలు, జవాబులతో జిల్లా పరిషత్ నుంచి విద్యార్థులకు అందించే విజయకేతనం బుక్‌లెట్లు ప్రింటింగ్ ఆలస్యమైంది. డిసెంబరులో అందాల్సిన ఈ స్టడీమెటీరియల్ జనవరిలో విద్యార్థులకు చేరింది.

జిల్లాలో 24,393 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరి కోసం 128 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఓపెన్ స్కూల్స్ నుంచి రెగ్యులర్, ప్రైవేటు మొత్తం 516 మంది విద్యార్థులకు ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 25 పోలీస్ స్టేషన్లలో కస్టడీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలకు సన్నద్ధతపై ఇప్పటికే కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఎక్కడా కాపీ జరగకుండా కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. జిరాక్స్ సెంటర్లు, నెట్ సెంటర్లను మూసివేయాలని, రూట్‌లను ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లను నియమించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్యసేవలు, అవసరమైన ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ఆదేశాలిచ్చారు.

గత ఏడాది పెరిగిన ఉత్తీర్ణత

2022-23 విద్యాసంవత్సరంలో 20,268 విద్యార్థులు హాజరుకాగా 13,362 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత 65.93 శాతంగా ఉంది. ఉత్తీర్ణత తగ్గడంపై విశ్లేషించిన విద్యాశాఖ పాసైన వారిలో పదివేల మంది వరకు విద్యార్థులు ఫస్ట్‌క్లాస్ సాధించగా, రెండు వేల మంది వరకు సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్టు గుర్తించింది. ఆరు వేల మంది వరకు సీ, డీ గ్రేడ్ విద్యార్థులే ఫెయిలయినట్టుగా గుర్తించి 2023-24 విద్యాసంవత్సరంలో మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గత ఏడాది 20,785 మంది విద్యార్థులు హాజరుకాగా 81.82 శాతంతో 17,007 మంది ఉత్తీర్ణత సాధించారు. మునుపటి ఏడాదితో పోలిస్తే గత ఏడాది 15.89 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

మార్చి 17 నుండి 31 వరకు 10వ తరగతి రెగ్యులర్ విద్యార్థులకు, 17వ తేదీ నుంచి మార్చి 28 వరకు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరగనుంది.

మార్చి 17న ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఎ), ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్స్), 19న సెకెండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లీష్, 22న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సాంస్క్రిట్, అరబిక్, పర్షియన్), 24న మ్యాథ్స్, 26న ఫిజికల్ సైన్స్, 28న బయోలాజికల్ సైన్స్, 29న మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సాంస్క్రిట్, అరబిక్, పర్షియన్), ఎస్ఎస్‌సీ వోకేషనల్ కోర్స్ (థియరీ), రంజాన్ నేపథ్యంలో 31న లేదా ఏప్రిల్ 1న సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించనున్నారు.

భీమవరంలో చికెన్ మేళా



చికెన్, ఎగ్ మేళాలో వంటకాలను రుచి చూస్తున్న ఆర్డీవో ప్రవీణ్‌కుమార్

భీమవరం: బర్డ్‌ఫ్లూ వల్ల మనుషులకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడలేదని భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ మురళీకృష్ణ అన్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా కోడిమాంసం, కోడిగుడ్ల వినియోగం తగ్గడంతో భీమవరంలో ఏర్పాటుచేసిన చికెన్-ఎగ్ మేళ అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. వలస పక్షుల ద్వారా వచ్చే బర్డ్‌ఫ్లూతో భయపడాల్సిన అవసరం లేదని ఇమ్యూనిటీ పవర్ రావాలంటే చికెన్, కోడిగుడ్లు తినాలని చెప్పారు. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ తినకూడదనేది కేవలం అపోహ మాత్రమేనని, సరైన పద్ధతిలో ఉడికించి తినడం వల్ల ఇబ్బంది ఉండదన్నారు. అనంతరం చికెన్ వంటకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర హేచరీస్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ సత్యనారాయణ, బ్రాంచ్ మేనేజర్ కార్తీక్, లోటస్ చికెన్ సంస్థల అధినేత కందుల భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై గళం



భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: మున్సిపాలిటీ, నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి వారు పనిచేస్తున్న సంస్థల ద్వారానే వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయుసి జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, జిల్లా నాయకుడు కె.మహంకాళి డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అనంతరం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: వివిధ రకాల సమస్యలతో పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించడానికి కృషిచేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి అర్జీదారుల సమస్యలను విచారించి తగిన పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశించారు.

ఓట్ల లెక్కింపు పారదర్శకంగా చేపట్టాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎన్నికల పరిశీలకుడు సీహెచ్. శ్రీధర్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేయాలని శ్రీధర్ అన్నారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు డిటైల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్ ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు మార్చి 3న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, ఉదయం 6 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. లెక్కింపు సుమారు మూడు రోజులు పాటు కొనసాగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్సులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి

48 గంటలు మద్యం దుకాణాల మూత

ఏలూరు(మెట్రో): పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసివేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు జిల్లా పరిధిలో పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను 48 గంటలపాటు మూసిఉంచేలా చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. మద్యం దుకాణాలు, బార్లను ఈ నెల 25 సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు డ్రై డేగా పాటించాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో, నియోజకవర్గంలోని ఏఈఆర్‌ఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

ఓటు ఎలా వేయాలి ?

ఏలూరు(మెట్రో): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానం ఇతర ఎన్నికల విధానానికి భిన్నంగా ఉంటుంది. ఈ ఎన్నికల్లో పార్టీల గుర్తులు, ఈవీఎంలు ఉండవు. బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థి పేరు, ఫొటో ఉంటుంది. ఎన్నికల అధికార్లు ఇచ్చిన పెన్ మాత్రమే వాడాలి. ప్రాధాన్యతాక్రమంలో అందరికంటే ఎక్కువగా నచ్చిన వారి పేరు ఎదురుగా గడిలో 1 అని అంకె వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి ప్రాధాన్యతను అనుసరించి 2, 3, 4 ఓట్లు వేయొచ్చు. లేదా వేయకుండా వదిలేయవచ్చు. ఒకే నెంబరును ఇద్దరికి వేయకూడదు. అలా చేస్తే చెల్లుబాటు కాదు. 1 వేయకుండా 2, 3, 4 నెంబర్లు వేస్తే ఓటు చెల్లదు. అంకెలు కాకుండా అక్షరాలు రాసినా, గుర్తులు, రోమన్ సంఖ్యలు వేసినా ఓటు చెల్లదు. తప్పనిసరిగా 1, 2, 3, 4 అంకెలే వేయాలి. ఎన్నికల సంఘం సూచించిన ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకు వెళ్లాలి. ఆధార్ కార్డు, పాన్ కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపు కార్డు, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, డిపార్టుమెంట్ ఫొటో గుర్తింపు కార్డు, ఉపాధి పథకం జాబ్ కార్డు, బ్యాంకులు, తపాలా శాఖలు జారీచేసిన ఫొటోతో ఉన్న పాస్ బుక్, పెన్షన్ డాక్యుమెంట్ వంటి వాటిలో ఏదొకటి తీసుకెళ్లాలి.

సేవల్లో పీహెచ్‌సీలు భేష్

- జగన్ హయాంలో అభివృద్ధి వల్ల తాజా ర్యాంకు
- నాటి చంద్రబాబు పాలనలో పీహెచ్‌సీలు నిర్వీర్యం



భీమవరం అర్బన్ పీహెచ్‌సీ భవనం



పీహెచ్‌సీల్లో ఆధునిక పరికరాలు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి చేసిన కృషి ఫలితంగా నేడు పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాయి. జిల్లాలో 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న నేపథ్యంలో గుర్తింపు పొందాయి. నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల స్థాయి పెంచడం, వైద్యుల సంఖ్య పెంచడం, అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంచి సకాలంలో ప్రజలకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు.

బాబు పాలనలో అధ్వానంగా..

గత చంద్రబాబు పాలనలో ప్రజల ఆరోగ్యం గాలికొదిలేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత, సిబ్బంది, మందులు, భవనాల కొరత ఉండేది. గత పాలనలో జిల్లాలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవనం కూడా నిర్మించలేకపోయారు. వైద్య సేవలు అరకొరగా అందేవి. వైద్య పరీక్షలు ఉండేవి కావు. వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదు.

జగన్ పాలనలో..

జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన తర్వాత కరోనా విపత్తు వల్ల రెండేళ్లు పాలనకు ఇబ్బంది వచ్చినా మిగిలిన మూడేళ్లల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి పనిచేశారు. శాశ్వత భవనాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జిల్లాలో రూ.16.14 కోట్లతో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించారు. అందులో రూ.7.20 కోట్లతో 9 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భవనాలు నిర్మించారు. రూ.8.94 కోట్లతో 6 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భవనాలు నిర్మించారు. రూ.1.20 కోట్లతో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పడకలు పెంచారు.

పూర్తిస్థాయి వైద్య సేవలు, సిబ్బంది

జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులను నియమించారు. పూర్తిస్థాయిలో సిబ్బంది, 14 రకాల పరీక్షలు, 100 రకాల మందులు, పాము, కుక్క కాటుకు వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంచారు. గుండెపోటుకు సంబంధించి రూ.45 వేల విలువైన ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచి అనేక మంది ప్రాణాలు నిలిపారు. డెలివరీ సంఖ్య పెరిగింది.

కూటమి ఘనత అన్నట్లు ప్రచారం

జగన్ పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. కూటమి నాయకులు మాత్రం తమ ప్రభుత్వంలో ఆరోగ్య కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని ఇది వారి ప్రభుత్వం గొప్పతనం అంటున్నారు. ఈ 8 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి చేసింది ఏమి లేదు.

జగన్ ప్రభుత్వంలో నిర్మించిన నూతన భవనాలు

భీమవరం 3, తాడేపల్లిగూడెం 1, నరసాపురం 1, పాలకొల్లు 1, తణుకు 1 ఆకివీడు 1, లంకలకోడేరు 1, ముదునూరు 1, మంచిలి 1, మేడపాడు 1, ఆచంట వేమవరం 1, కాళ్ల 1.

జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగానే..



జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అన్ని రకాలుగా అభివృద్ధి కృషి చేశారు. ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధి చేయడం వల్లే నేడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రథమ స్థానంలో నిలిచాయి.

– గూడూరి ఉమాబాల, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి

ప్రజారోగ్యమే లక్ష్యంగా..



జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించారు. ఇద్దరు వైద్యులను నియమించి.. వారి ద్వారా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందేలా చేశారు. అంతకముందు పరిస్థితి దారుణంగా ఉండేది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

కొల్లేరుపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు



ఏలూరులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు

ఏలూరు(టూటౌన్): ఎన్నికల ముందు సూపర్ సిక్స్, స్వీట్ సిక్స్ హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేశారంటూ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు అన్నారు. ఏలూరులో సోమవారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొల్లేరులో ఎస్సీ, బీసీలకు చెందిన వేల పేద కుటుంబాలు ఉన్నాయని, కాంటూరు పేరుతో చెరువులను ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తున్నారన్నారు. కొల్లేరు ప్లస్-3 లేదా ప్లస్-5 అనేది ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. చెరువులను ధ్వంసం చేసి పేద ప్రజల జీవనాధారాన్ని నాశనం చేస్తే వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొల్లేరు అంశంపై పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తుతానన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో ఎవరికీ అన్యాయం జరగకుండా కులగణన చేపట్టి ఎవరి వాటా ఎంతో తేల్చాలన్నారు. రాష్ట్రంలో ఎవరికి అన్యాయం జరిగినా దానికి ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. ఎస్సీ ఉపకులాలు అన్నింటికీ సమన్యాయం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాలల పక్షాన నిలుస్తున్నారంటూ మంద కృష్ణ మాదిగ ఆరోపించడాన్ని ఆయన తప్పుపట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీల్లోని అన్ని కులాలకు సమన్యాయం చేశారన్నారు. ఇటీవల వైఎస్ జగన్ గుంటూరు మిర్చి యార్డు సందర్శన సందర్భంగా ఆయనకు సెక్యూరిటీ లోపభూయిష్టంగా ఉన్నట్లు ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. ఏలూరు నగరం, పరిసర గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్ల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు తీసుకురానున్నట్లు తెలిపారు. ఏలూరు కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, నవసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఊదరగొండి చంద్రమౌళి, ఎస్సీ జేఏసీ నాయకులు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ప్రొఫెసర్ ఎస్‌పీడీ పాల్, పళ్ళెం ప్రసాద్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు

ఉండి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. మండలంలోని కలిగొట్లలో స్థానిక టీడీపీ నాయకుడిని చంపుతానని బెదిరించారంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాసరి కిశోర్‌పై ఆదివారం రాత్రి అక్రమంగా పోలీసులు కేసు నమోదు చేసారు. బెదిరింపులకు పాల్పడిన ఫోన్ నంబర్ తనది కాదని, ఎంత మొరపెట్టుకున్నా కనికరించని పోలీసులు కేసు పెట్టారు. కిశోర్ తమ్ముళ్లు, బంధువుపై కూడా కేసు నమోదు చేసారు. ఇటీవల గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా కుట్టుమిషన్ల పంపిణీ జరిగింది. ఆ సమయంలో బ్యానర్‌కు నిప్పుపెట్టారంటూ ఫిర్యాదు మేరకు దాసరి సుధాకర్, దాసరి కిశోర్, యేలేటి రాజశేఖర్, దాసరి కిరణ్‌పై కేసు నమోదు చేశారు. ఎవరు తగులబెట్టారో తెలియదని కార్యకర్తలు చెబుతున్నా కేసులు నమోదు చేశారంటూ ఆరోపిస్తున్నారు.

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

భీమవరం: ఇంటర్ సబ్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 25న భీమవరం ఫెన్సింగ్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వి కృష్ణ మోహన్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి అర్హత పోటీలు నిర్వహిస్తామని, వివరాలకు 96802 34566 నెంబరులో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

సైంటిఫిక్ మెజీషియన్ గోపాలరెడ్డికి పురస్కారం



జ్ఞాపిక అందుకున్న గోపాలరెడ్డి

తణుకు అర్బన్ : ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం సందర్భంగా ఈనెల 23న విశాఖపట్టణంలో ఇండియన్ మ్యాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తణుకుకు చెందిన సైంటిఫిక్ మెజీషియన్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బీఎం గోపాలరెడ్డి అత్యుత్తమ పురస్కారంతోపాటు జ్ఞాపికను అందుకున్నారు. భారతదేశం తరుపున పలువురు మెజీషియన్లు పాల్గొన్న క్యార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికులు పీసీ సర్కార్, డాక్టర్ బీఎస్ రెడ్డి చేతులమీదుగా సత్కారం, జ్ఞాపిక అందుకున్నట్లు గోపాలరెడ్డి చెప్పారు.

రైతులు తప్పనిసరిగా విశిష్ట సంఖ్య పొందాలి



సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా, ఏడీఏ విద్యాసాగర్

నూజివీడు : రైతులు తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకొని 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా పేర్కొన్నారు. అన్నవరంలోని రైతు సేవా కేంద్రంలో ఫార్మర్స్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకురాలు రత్నప్రియను పలు విషయాలపై ఆరా తీశారు. గ్రామంలో 488 రికార్డులకు గాను ఇప్పటి వరకు 308 రికార్డులు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేసే పథకాలు, రాయితీలు అన్నీ కూడా ఈ విశిష్ట సంఖ్య ఉన్న రైతులకే వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జీ విద్యాసాగర్, ఏఓ ఆలూరి చాముండేశ్వరి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో అరుదైన పక్షి ప్రత్యక్షం



శ్రీవారి ప్రదక్షిణ మండపంలో నైట్జార్ పక్షి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఒక అరుదైన పక్షి సోమవారం ప్రత్యక్షమయ్యింది. ఇండియన్ నైట్జార్ జాతికి చెందిన ఈ పక్షి ఆలయ ప్రదక్షిణ మండపంలో హనుమద్ వాహనంపై వాలింది. కొద్ది సేపటి తరువాత ఎగరలేక అక్కడే నేలపై పడుకుంది. ఆ సమయంలో స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులు పలువురు ఈ పక్షిని వింతగా చూశారు. పొడవైన కోణాలు కలిగిన రెక్కలు, చిన్న పాదాలతో, రాత్రివేళల్లో చురుగ్గా ఉండే ఈ ఇండియన్ నైట్జార్ పక్షి దక్షిణ ఆసియా, ఆగ్నేయ ఆసియా ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అయితే ఈ పక్షి ఇక్కడికి ఎలా వచ్చిందో ఎవరికీ తెలియ లేదు.

బలివేలో మద్యం విక్రేత పట్టివేత

ముసునూరు: బలివేలో మద్యం విక్రయిస్తున్న నాగుల కుమారి అనే మహిళను అదుపులోకి తీసుకుని, ఆరు మద్యం సీసాలు స్వాధీనపర్చుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య చెప్పారు. దాడుల్లో ఎస్సై లు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.





చలమ నీటిని బిందెల్లోకి తోడుకుంటున్న గిరిజన మహిళలు

దశాబ్దాలుగా చీకట్లోనే

- నాగరిక జీవనానికి దూరంగా మోదేలు గిరిపుత్రులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ కోసం రూ.70 లక్షల మంజూరు
- అటవీశాఖ అభ్యంతరాలతో ఆగిన పనులు
- గ్రామానికి వెళ్లాలంటే కొండల్లో నడవాల్సిందే



అటవీ ప్రాంతంలో ఉన్న మోదేలు గ్రామం

బుట్టాయగూడెం: ప్రపంచమే కుగ్రామంగా మారిన ఈ రోజుల్లో పశ్చిమ ఏజెన్సీలోని ఒక గ్రామంలో ఇప్పటికీ సెల్‌ఫోన్లు, టీవీలు లేవు. నెలకు ఒకసారి కూడా బస్సులు, ఆటోల ముఖం కూడా చూడరు. నాగరిక జీవనానికి దూరంగా ఉంటున్న ఆ గ్రామం మోదేలు. ఏదైనా పనిమీద బయటకు రావాలంటే మోదేలు నుంచి వేలేరుపాడుకు 70 కిలోమీటర్లు, మోదేలు నుంచి బుట్టాయగూడెం 25 కిలోమీటర్లు దూరం ఉంటుంది. దట్టమైన అటవీ ప్రాంతంలో రాళ్లబాటలో నడిచి వెళ్ళాలి. గతంలో ఆ గ్రామానికి సోలార్ లైట్‌లు ఇచ్చినప్పటికీ అవి సక్రమంగా పని చేయకపోవడంతో టార్చిలైట్ వెలుగుల్లో ఉంటున్నారు. ఈ గ్రామ జనాభా 140 మంది. గ్రామంలో ఎవరికైనా అనారోగ్య సమస్య వస్తే డోలీ కట్టి మోసుకుంటూ మైళ్ల దూరం మోసుకెళ్లాల్సిన పరిస్థితి.

మోదేలు గ్రామం దట్టమైన అటవీప్రాంతంలో కొండల మధ్య ఉంది. బుట్టాయగూడెం మండలానికి దగ్గరగా ఈ గ్రామం ఉండడంతో వీరి అవసరాల కోసం దొరమామిడి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం ప్రయాణిస్తూ ఉంటారు. దట్టమైన అటవీప్రాంతంలో రాళ్లబాటపై నడుచుకుంటూ రావాలి. సుమారు 30 కుటుంబాలకు చెందిన 140 మంది కొండరెడ్డి గిరిజనులు నివసిస్తున్నారు. వేసవిలోఈ గ్రామంలో మంచి నీరు కూడా దొరకని పరిస్థితి. దీంతో తూర్పు కొండల వైపు 25 కుటుంబాలతో మరొక గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామానికి చుట్టూ కొండలు, ఎత్తయిన చెట్లు, కాల్వలు, క్రూర మృగాల మధ్య వీరు జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామాన్ని అలివేరు పంచాయతీలో కలపాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి



మాకు రోడ్డు, విద్యుత్ సదుపాయం కల్పించాలి. మంచి నీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు వేశారు. వాటి ద్వారా సుద్ద నీరు వస్తుంది. ఈ నీరు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటర్ ట్యాంక్ నిర్మించి బ్లీచింగ్ వేస్తే బాగుంటుంది.

– కెచ్చెల బాలిరెడ్డి, మోదేలు

మంచినీటి ట్యాంక్ నిర్మించాలి



విద్యుత్ పనులు పూర్తి చేసేలా ఐటీడీఏ అధికారులు కృషి చేయాలి. గ్రామంలో చదువుకున్న నిరుద్యోగులకు వలంటీర్ పోస్టులు ఇవ్వాలి. గ్రామంలో మంచినీటి ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీరు సమస్య లేకుండా చూడాలి.

– కారం రాఘవ, ఏఐకేఎంఎస్ నేత, అలివేరు

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



స్వాతంత్ర్యానికి ముందే మా గ్రామం ఏర్పడింది. దశాబ్దాలుగా మేము ఎన్నో సమస్యలతో బాధపడుతున్నాం. పోడు భూముల వ్యవసాయం కోసమే ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాం. మాకు ప్రభుత్వం మా గ్రామంలోనే ఇళ్లు నిర్మించాలి.

– కెచ్చెల గంగాభవానీ, మోదేలు

పట్టించుకోని ఐటీడీఏ

ఐటీడీఏ వీరి జీవితాల్లో వెలుగులు నింపలేకపోతుందని ఆదివాసీలు గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి. గ్రామం స్వాతంత్ర్య రాక ముందే ఏర్పడినా 2021 వరకు ఆ గ్రామాన్ని సందర్శించిన అధికారులు, ప్రజాప్రతినిధులు లేరు. మొదటి సారి అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓలు మాత్రమే ఎంతో కష్టంలో ఆ గ్రామాన్ని సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. గ్రామానికి విద్యుత్ సౌకర్యం కోసం రూ.70 లక్షలు నిధులు కేటాయించారు. రహదారి పనులు కోసం రూ.3 కోట్లు నిధులు కేటాయించారు. అటవీశాఖ అధికారులు అభ్యంతరాలతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఐడీడీఏ అధికారులు పట్టించుకోలేదు.

పోడు వ్యవసాయమే ఆధారం

మోదేలు గిరిజనులకు పోడు వ్యవసాయం ప్రధానం. 150 ఎకరాల్లో కంది, జొన్న, చోళ్లతో పాటు జీడిమామిడి పంటలను పండిస్తున్నారు. జొన్న, చోళ్లు వీరు తినడం కోసం పండిస్తుంటారు. దొరమామిడిలోని వారాంతపు సంతలో సరుకులు కొనుగోలు చేసి తెచ్చుకుని తింటారు.

విద్యుత్ కోసం నిధులు మంజూరు చేసిన గత ప్రభుత్వం

విద్యుత్ సౌకర్యం కోసం అధికారులు లైన్లు వేసేందుకు సర్వే చేశారు. లంకపాకల నుంచి మోదేలుకు 6.3 కేవీ సామర్థ్యంతో సింగిల్‌లైన్ వేసేలా గుర్తించారు. సుమారు 8 కిలోమీటర్ల మేర 200 స్తంభాలతో లైన్ వేసేలా సర్వేను పూర్తి చేశారు. సర్వే సమయంలో ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం పెట్టడంతో పనులు నిలిచిపోయాయి. విద్యుత్ లైన్‌లు వేయాల్సిన ప్రాంతం బుట్టాయగూడెం మండలంలో 70 శాతం, కుక్కునూరు అటవీశాఖ పరిధిలోకి 30 శాతం వస్తుంది. ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలతో చీకట్లోనే మగ్గుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టిసంలో ఉత్సవ ఏర్పాట్లు పూర్తి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

పోలవరం రూరల్: పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తయ్యాయని జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంవీ రమణ తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను ఆమె డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఫెర్రీ, ఇసుక తిన్నెలు, శివక్షేత్రం వద్ద చేపట్టిన పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టిందన్నారు. సీసీ కెమేరాలు, డ్రోన్ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టనున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇసుక తిన్నెలపై విద్యుత్ అలంకరణ ఏర్పాట్లలో లోటుపాట్లు ఉన్నట్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో మంగళవారం మధ్యాహ్నం లోగా పూర్తి చేయాలని ఆర్డీవో సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో పోలవరం సీఐ సురేష్‌బాబు, తహసీల్దార్ సాయిరాజు, ఎస్సై పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ నిర్మాణానికి క్రీడలు వేదిక కావాలి



పోటీలను ప్రారంభించిన దృశ్యం

పెంటపాడు: విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి క్రీడలు వేదిక కావాలని విజయవాడ హెల్త్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నరసింహం పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో కళాశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వీసీ నరసింహం, విద్యాసంస్థల చైర్మన్ ఆకుల విజయవర్ధన్ క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆరోగ్య విశ్వవిద్యాలయ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి ఈ. త్రిమూర్తి తదితరులు కళాశాలల టీంలు అందించిన మార్చ్‌ఫాస్ట్, గౌరవ వందనాన్ని స్వీకరించారు. రాష్ట్రంలోని ఆయుష్, ఫిజియో థెరపీలకు చెందిన 20 కళాశాల టీంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు జరగబోయే ఈ పోటీల్లో వాలీబాల్, క్రికెట్, టేబుల్‌టెన్నిస్, చెస్, అథ్లెటిక్, త్రోబాల్, బాడ్మింటన్, పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గూడెం ట్రినిటీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ విజయ్ సృజిత్, కళాశాల ప్రిన్సిపాల్, క్రీడాపోటీల అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ పోటీలను పర్యవేక్షించారు.

భార్య, అత్తపై కొడవలితో దాడి

ఉండి: భార్య, అత్తపై ఓ వ్యక్తి విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. బాధితులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఆరేడు గ్రామానికి చెందిన పెరికెల నాగదేవితో ఉండికి చెందిన భావన సురేష్‌కు సుమారు పదేళ్లక్రితం ప్రేమ వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేష్ మూడేళ్ల క్రితం గల్ఫ్‌దేశం వెళ్లి వచ్చాడు. సంక్రాంతి పండుగ సమయంలో ఆటోతో ఓవ్యక్తిని గుద్దిన కేసులో ఇరుక్కోవడంతో దానిని పురస్కరించుకుని ఆనాటి నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. వివాదాలకు దూరంగా ఉండాలని భార్య, అత్త సూచించడంతో వారిపై సురేష్ కోపం పెంచుకున్నట్లు చెబుతున్నారు. ఇటీవల పదిరోజుల క్రితం భర్తతో మరోసారి గొడవ జరగడంతో నాగదేవి తన ఇద్దరు పిలలతో ఆరేడులోని పుట్టింటికి వెళ్లింది. అయితే భార్య ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆమెతో మాట్లాడేందుకు సోమవారం సురేష్ ఆరేడు వెళ్లాడు. భార్యతో మాట్లాడుతుండగా మాటామాటా పెరగడంతో కోపంతో ఊగిపోయిన సురేష్ అక్కడే ఉన్న కొడవలి సాయంతో భార్య నాగదేవిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. కుమార్తెకు అడ్డువెళ్లేందుకు ప్రయత్నించిన అత్త ధనలక్ష్మిపైనా దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయాలపాలైన ఇద్దరు మహిళలను బంధువులు 108లో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. దాడికి దిగిన సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆసుపత్రి నుంచి వివరాలు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వెంకట శ్రీనివాసరావు మృతదేహం

కొయ్యలగూడెం: మోటార్‌సైకిల్‌ను టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొయ్యలగూడెం–బయ్యన్నగూడెం జాతీయ ప్రధాన రహదారి మధ్యలో పవర్ గ్రిడ్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లా చిల్లగుంపు గ్రామానికి చెందిన ఉప్పల వెంకట శ్రీనివాసరావు (37) బైక్‌పై తాడేపల్లిగూడెం వెళ్లి తిరిగి వస్తున్నాడు. జంగారెడ్డిగూడెం వైపు వెళుతుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరావు కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

52 కేంద్రాలు.. 37,900 మంది విద్యార్థులు

- 1 నుంచి ఇంటర్ పరీక్షలు
- పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్



భీమవరంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

భీమవరం: ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా సుమారు 37,900 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లాలోని 121 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 19,708 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 18,123 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణలో మార్చి 1వ తేదీ నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రశ్నాపత్రాలను జిల్లాలోని 13 స్టోరేజ్ పాయింట్ల వద్ద భద్రపర్చగా నిర్వహణకు 52 మంది సూపరింటెండెంట్లు, మరో 52 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, నాలుగు సిట్టింగ్, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించే ప్రసక్తి ఉండదు. ఇప్పటికే పరీక్షల హాల్ టికెట్ల జారీ ప్రారంభించగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న కళాశాలలతోపాటు ఇంటర్‌నెట్‌లో కూడా హాల్ టికెట్లు పొందువచ్చు. పరీక్షాకేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలతోపాటు తాగునీరు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం



మార్చి 1వ తేది నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేశాం. గత ఏడాదికంటే ఉత్తీర్ణతాశాతం పెంచేందుకు కృషి చేశాం. హాజరుతో సంబంధం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులంతా పరీక్షలకు హాజరుకావచ్చు.

– ఎ.నాగేశ్వరరావు, డీఈఓ, భీమవరం

వైభవం.. నవనారసింహ హోమం

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాధపురంలో సుందర గిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ కనకవల్లీ సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో జరుగుతున్న అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహ 31వ మహాయజ్ఞాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా ఉదయం యజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ గర్భాలయంలో కొలువైన నారసింహుని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ యాగశాలలో పండితులు, రుత్వికులు వేద మంత్రోచ్ఛరణల నడుమ మండపారాధన, నిత్యహోమాన్ని జరిపారు. అలాగే శాలిగ్రామ అభిషేకాలు, ఆ తరువాత ఉపనిషత్ పూర్వక లక్ష్మీగణపతి మూల మంత్ర సహిత అష్టద్రవ్య హోమాన్ని వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం నరసింహ గురూజీ యాగశాలలో మహాయజ్ఞ క్రతువుకు శ్రీకారం చుట్టి, కలశ ప్రతిష్ఠ, రుద్రహోమాన్ని, నవనారసింహ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26 సాయంత్రం నుంచి, మరుసటి రోజు తెల్లవారుజాము వరకు ఈ మహా యజ్ఞ వేడుక అంగరంగ వైభవంగా జరుగుతుందని యజ్ఞ పర్యవేక్షకులు సీహెచ్ కుటుంబరావు తెలిపారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.



హోమాన్ని జరుపుతున్న పండితులు, రుత్వికులు



గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేస్తున్న లక్ష్మీనరసింహ గురూజీ



యాగశాలలో పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

చికెన్‌పై ఉన్న అపోహలను విడనాడండి



చికెన్ మేళా కార్యక్రమంలో క్యూలో నిలుచున్న మాంసాహార ప్రియులు

కొయ్యలగూడెం : చికెన్ మేళా కార్యక్రమం సోమవారం కొయ్యలగూడెంలో నిర్వహించారు. చికెన్ పలావ్, చికెన్ ఫ్రై, చికెన్ తందూరి వంటి రకాలను ఉచితంగా పంపిణీ చేయడంతో మాంసాహార ప్రియులు ఎగబడ్డారు. వెన్‌కాబ్ జంగారెడ్డిగూడెం శాఖచే సుమారు వెయ్యి మందికి పైగా మాంసాహార ప్రియులకు ఈ ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్‌పై ఉన్న అపోహలను తొలగించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వంద డిగ్రీల వేడిలో మాంసాన్ని ఉడికించడం వల్ల ఇబ్బందులు ఉండవని చెప్పారు. బయ్యనగూడెం సొసైటీ వద్ద చికెన్ మేళా నిర్వహించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: ట్రాక్టర్ ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి చెందాడు. తాడువాయి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలివి. టి.నరసాపురం మండలం బొచ్చులేటిగూడానికి చెందిన పూనెం రాము కూలిపని చేసుకుని జీవిస్తున్నాడు. ప్రస్తుతం జంగారెడ్డిగూడెం మండలం జల్లేరులోని తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి మోటార్‌సైకిల్‌పై తాడువాయి వెళ్లి తిరిగి జల్లేరు వస్తుండగా తాడువాయి షుగర్ ఫ్యాక్టరీ సమీపానికి వచ్చే సరికి ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాము భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



గూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాడే పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘువులను గెలిపించాలని సీఐటీయూ నాయకులు కోరారు. నియోజకవర్గంలో సోమవారం ఎమ్మెల్సీ ప్రచార సభ జరిగింది. సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావులు మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం, నిత్యావసర వస్తువులు తగ్గేందుకు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు దిడ్ల వీర రాఘువులను ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువ కళా మిత్ర మండలి వార్షికోత్సవం



సత్కార కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువ కళా మిత్ర మండలి 32వ వార్షికోత్సవం స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో జరిగింది. కావాలి బీవీ సుబ్బారాజుకు షణ్ముఖి ఆంజనేయరాజు పేరిట అవార్డు, తణుకు దంపూరి దుర్గా ప్రసాద్‌కు పూడిమూడి సూరిబాబు పేరిట అవార్డును ప్రధానం చేశారు. కళాకారులకు సత్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో బుద్దాల వెంకట రామారావు, ఎస్‌కే ఫాతిమా, యువకళా మిత్ర మండలి సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

9036 మందికి పింఛన్లు

తాడేపల్లిగూడెం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ కింద మునిసిపాలిటీలో మార్చినెల ఒకటోతేదీన 9036 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. పింఛన్ల కోసం మూడు కోట్ల 96 లక్షల రూపాయలు విడుదలయ్యాయన్నారు. మార్చి ఒకటి ఉదయం 5.30 నుంచి వీటి పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. 231 మంది సచివాలయ కార్యదర్శులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జోరుగా జోనల్ క్రీడా పోటీలు



పెంటపాడు ఎస్వీబీఎన్ హిందూ హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పెంటపాడు : మండలంలో ఎస్వీబీఎన్ హిందూ హైస్కూల్లో మూడు రోజులపాటు జరగబోయే స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ జోనల్ స్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు సోమవారం పాల్గొన్నారు. మొదటి రోజు అథ్లెటిక్స్ పోటీల్లో పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాల నుంచి 6 విభాగాల్లో 7 గురు ప్రతిభను కనపరిచారు. రెండో రోజైన సోమవారం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీల్లో బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. పీఈటీలు సత్తి కన్నారెడ్డి, శేఖరబాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పీడీలు, పీఈటీలు చంద్రశేఖర్, యోహాను, కె. వెంకటేశ్వరరావు, శివలీల, విద్యాశాఖాధికారులు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్, హెచ్ఎం రాజేష్ తదితరులు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

విశ్రాంత ఉద్యోగులకు డీఆర్, పీఆర్సీ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న వీకే వీరారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన డీఆర్, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో హరికుమార్ మాట్లాడుతూ ఎడిషనల్ కోంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ చేయాలన్నారు. కొత్త పీఆర్సీ వచ్చేలోపుగా కనీసం 30 శాతం ఇంటిరీయమ్ రిలీఫ్ ప్రకటించాలన్నారు. ఎన్నికల ముందు మెరుగైన పీఆర్సీ ఇస్తామని, నగదు రహిత ఆరోగ్య ప్రయోజనాలు కలుగజేస్తామని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించే విధంగా చేస్తామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు కావస్తున్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ నెల 28వ తేదీలోపు జీవన ప్రమాణ పత్రాలు దాఖలు చేసుకోవాలని కోరారు.

‘పది’ విద్యార్థులకు దాతల ఔదార్యం

- ప్రతిరోజూ సాయంత్రం పది విద్యార్థులకు అల్పాహారం
- మానవత, సజ్జాపురం లయన్స్ క్లబ్ సేవలు
- హర్షిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



తణుకులో ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న మానవత సేవా సంస్థ ప్రతినిధులు (ఫైల్)



తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు (ఫైల్)

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు. ఆయా పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం అదనపు సమయం గంట చొప్పున విద్యార్థులను ఉపాధ్యాయులు సానపడుతున్నారు. విద్యార్థులు సైతం తమకున్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువుతున్నారు. ఈ నేపథ్యంలో తణుకు జాస్తి సీతామహాలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు అల్పాహారాన్ని అందజేస్తున్నారు. దీంతో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో చదువులో నిమఘ్నమవుతున్నారు.

దాతల ఔదార్యం..

మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో గత 25 రోజులుగా తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాయంత్రం అదనపు తరగతి సమయంలో అల్పాహారం అందజేస్తున్నారు. సాయంత్రం సంస్థ ప్రతినిధులు స్వయంగా హాజరై 26 మంది విద్యార్థులకు టిఫిన్స్, స్నాక్స్, పండ్లు వంటివి కొసరికొసరి వడ్డిస్తున్నారు. తణుకు జాస్తి సీతామహాలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థులకు సజ్జాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం సమయంలో పాఠశాలకు వచ్చి విద్యార్థులకు రకరకాల స్నాక్స్, టిఫిన్స్‌తో కూడిన అల్పాహారాన్ని వడ్డిస్తుండడంతో విద్యార్థులతో పాటు తల్లి దండ్రులు కూడా సంతోషిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ప్రతి ఏడాది పదో తరగతి విద్యార్థులకు సజ్జాపురం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అల్పాహారాన్ని ఇస్తున్నారని పాఠశాల హెచ్ఎం తోట వరలక్ష్మి చెబుతున్నారు.

అల్పాహారం సద్వినియోగపడుతుంది



మా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మానవత సేవా సంస్థ అందిస్తున్న అల్పాహారం పూర్తిగా సద్వినియోగపడుతుంది. ఉదయం ఎప్పుడో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం వరకు మధ్యాహ్నం తిన్న అన్నం మాత్రమే అవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మానవత సంస్థ అల్పాహారం పేరుతో కడుపునిండేలా స్నాక్స్, పండ్లు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులంతా చదువుపై ఎంతో శ్రద్ధ పెడుతున్నారు.

– కొల్లి సౌజన్య, ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నట పాఠశాల పదవ తరగతి విద్యార్థిని

విద్యార్థులకు అల్పాహారం సంతృప్తినిచ్చింది



మానవత సేవా సంస్థ సభ్యులందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం. ఉదయాన్నే పాఠశాలకు వచ్చి సాయంత్రం వరకు పాఠశాలలో ఉంటున్న విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం మాకు చాలా సంతోషంగా ఉంది. సంస్థ తరపున ఎన్నో సేవాకార్యక్రమాలు చేసినప్పటికీ దాతల సహకారంతో విద్యార్థులకు అందజేస్తున్న ఈ సేవ చాలా సంతృప్తిగా ఉంది.

– కోడూరి రాధా పుష్పవతి, మానవత సంస్థ విస్తరణ, అభివృద్ధి కమిటీ స్టేట్ కన్వీనర్

మానవత్వాన్ని చూపిన మానవత



మానవత సేవా సంస్థ తమ సేవాకార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని చూపిస్తోంది. విద్యార్థుల సౌకర్యార్థం అడిగిన వెంటనే మేము సిద్ధమంటూ పాఠశాలలోని 26 మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారాన్ని తీసుకువచ్చి వడ్డించి వెళ్తున్నారు. మా విద్యార్థులు ఎంతో అదృష్టవంతులు. విద్యార్థులందరికీ మానవత సేవలు మనస్సులో నిలిచిపోయాయి. మా పాఠశాలకు మంచి ఫలితాలు వస్తే అందులో మానవత భాగస్వామ్యం కూడా ఉంటుంది.

–తాళాబత్తుల రామకృష్ణ, ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు

ఘనంగా సంతాన గోపాలస్వామి కల్యాణం



అత్తిలిలో సంతాన గోపాలస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని అత్తిలి గ్రామంలో రుక్మిణీ, సత్యభామా సమేత సంతాన గోపాలస్వామి తిరు కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన యడ్లపల్లి అయ్యప్ప స్వామి, జగదీశ్వరి దంపతులచే స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణచార్యులు, వల్లీ వెంకటేష్, వి సూర్యతేజ ఆధ్వర్యంలో కల్యాణోత్సవ పూజాదికాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. స్వామిఅమ్మవార్లకు సమర్పించే తలంబ్రాలను సంతానం లేని మహిళలు తమ కొంగులలో పట్టుకున్నారు. స్వామివారి తలంబ్రాలతో క్షీరాన్న ప్రసాదం చేసుకుని తింటే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తులు విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీలలితా భక్త సమాజం వారిచే విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీనివాస భజన మండలివారిచే కోలాట భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త లింగంపల్లి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సామూహిక సత్యదేవుని వత్రాలు



ఈడూరులో సామూహిక సత్యనారాయణస్వామి వత్రాలను ఆచరిస్తున్న భక్తులు



ఈడూరులో శ్రీస్వామివారి గ్రామోత్సవం

అత్తిలి: మాఘమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలో బులి తిరుపతిగా పేరుగాంచిన అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సామూహిక సత్యనారాయణ వత్రాలు, శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు కనులపండువగా జరిగాయి. ఉదయం స్వామివారిని పుష్పాలతో అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వత్ర పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన మాజీ చైర్మన్ ప్రభాకర కోటిరామలింగరాజు దంపతులతో పాటు 130 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు, వాడపల్లి విభన్‌బాబు ఆధ్వర్యంలో చానమిల్లి గ్రామానికి చెందిన నరశింహాచార్యులు పలువురు వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సత్యదేవుని వత్రాలు, శ్రీనివాస కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. భీమవరానికి చెందిన వారణాసి లక్ష్మినరశింహశాస్త్రి కల్యాణోత్సవ, సత్యదేవుని వత్రాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సత్యనారాయణస్వామి వత్రాలు, శ్రీనివాస కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైయ్యారు. భక్తులకు అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం అందజేశారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ



వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం పట్టణంలోని 17,19,20,25 వార్డుల్లో వెక్టర్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, వార్డులలో ప్రజలకు అవగాహన, ర్యాలీలు జరిగాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య పోషణ అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించారు. ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలని, దోమల ద్వారా వచ్చే లార్వాలను నిర్మూలించాలని తదితర విషయాలను అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, రాజేశ్వరీ, శానిటేషన్ కార్యదర్శి రఘువీర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, సిబ్బంది, భవాని, దుర్గ, కోమలి, లక్ష్మి, ఏలూరి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

26న పడాలలో శివరాత్రి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల అయ్యప్పస్వామి ఆలయ సముదాయంలోని మహా త్రిపుర సుందరేశ్వరి సహిత సోమసుందరేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 26వ తేది ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్టు అయ్యప్పసేవా సమితి సభ్యులు తెలిపారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారి కల్యాణం, అనంతరం లింగోద్భవ కాల అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించాలని కోరారు.

మెరుగైన విద్యా బోధనే లక్ష్యం



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు



పెంటపాడు : ప్రభుత్వ బేసిక్‌స్కూల్లో ఐసీడీఎస్ సిబ్బంది శిక్షణ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అంగన్‌వాడీల్లో చిన్నారులకు మెరుగైన విద్యా బోధనే లక్ష్యంగా ప్రభుత్వం కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని సమగ్ర శిక్ష అభియాన్ అడిషినల్ కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్ అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను ఎంఈవో–2 పీఎం కే.జ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 120 రోజుల శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు వినియోగించుకోవాలన్నారు. తద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కనకదుర్గ, రిసోర్స్‌పర్సన్ ఎ.పోతురాజు, ఆర్.రామభద్రరావు, పి.సన్యాసిరావు, కే.శ్రీదేవి, జి.బేబి, డి.ఎస్తేరురాణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలి

పెంటపాడు: ప్లిలల సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పలువురు వక్తలు కొనియాడారు. పోషణ్ బీ– పడాయి బీ శిక్షణలో భాగంగా పెంటపాడు మండలం మీనవిల్లూరు, పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్ ప్రాంతాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఐసీడీఎస్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ రెండో విడతలో భాగంగా శిక్షకులు సిబ్బందికి పలు విషయాలు బోధించారు. గూడెం, పెంటపాడు, టౌన్ ప్రాంతాలకు చెందిన ఐసీడీఎస్ సిబ్బందితో పాటు, సూపర్‌వైజర్‌లు దుర్గాభవాని, జీజీబీ విజయలక్ష్మి, సుజాత, ఎస్తేరురాణి, శ్రీదేవి, బేబీ పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

- ఆలయాల ఆవరణలో చలువ పందిర్లు
- భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాటు



తణుకులో శివరాత్రి పూజలకు సిద్ధమైన సజ్జాపురం శివాలయం.



తణుకు సజ్జాపురం శివాలయంలో భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు నిర్మిస్తున్న దృశ్యం



పెద్ద శివాలయం



మల్లిఖార్జునస్వామి

తణుకు అర్బన్: శివరాత్రి సందర్భంగా తణుకులో సజ్జాపురం శ్రీ ఉమాసోమేశ్వరస్వామి, పాతవూరు ఉమా సిద్ధేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబులు పూర్తి చేసుకున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలకు రంగులు వేసి చలువ పందిర్లు వేశారు. విద్యుత్ దీపాల వెలుగులతో తీర్చిదిద్దారు. ఈనెల 26న శివరాత్రి సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో వెళ్లి స్వామివారిని దర్శించుకునేలా బారికేడ్లు నిర్మించారు. సోమవారం సజ్జాపురం ఉమా సోమేశ్వరస్వామిని పెండ్లి కుమారుడిగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం స్వామికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవారికి వేద పండితుల వేద మంత్రోచ్చరణముల మధ్య వైభవంగా కల్యాణం నిర్వహించనున్నారు. 26వ తేదీ తెల్లవారుజామున 2 గంటలకు అభిషేకాలు, గోస్తనీ నది స్నానాల అనంతరం స్వామివారి దివ్య దర్శనం, రాత్రి 9 గంటల నుంచి లక్షపత్రి పూజలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.జానకిరామరాజు తెలిపారు. 28వ తేదీ సాయంత్రం స్వామివారికి శ్రీపుష్ప యాగోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు.

మహా ఉత్సవాలకు సర్వం సిద్ధం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు కాలువ వద్ద పురాతన పెద్ద శివాలయం శ్రీ భ్రమరాంబికా సహిత మల్లిఖార్జున స్వామి కళ్యాణ మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. అంకురార్పణ, ధ్వజారోహణము, అగ్ని ప్రతిష్టాపనలు జరిగాయి. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని పురజన వర్తక సంఘం వారిచే ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. క్యూ లైన్‌లు ఏర్పాటు, చలువ పందిర్లు, విద్యుత్‌లైట్లు, గుడి లోపల పుష్పాలంకరణలు గావించారు. 25వ తేదీ మంగళవారం రాత్రి 10.15 గంటలకు ఈలి వీర వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, విజయచాముండేశ్వరి దేవి దంపతులచే దివ్య కల్యాణం నిర్వహించనున్నారు. 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్వామి వారికి ఫల, పుష్ప కానుకల సమర్పణ నిర్వహించనున్నారు. అదే విధంగా 28వ తేదీ శుక్రవారం స్వామి వారికి పుష్పయాగం, మార్చి 3వ తేదీన సోమవారం గ్రామోత్సవం, పల్లకి సేవ, ఊరేగింపు నిర్వహించనున్నారు. భక్తులు దర్శించి తరించాలని ఆయల కమిటీ సభ్యులు కోరారు. అదే విధంగా స్థానిక వాసవి ఆలయంలోను, షిర్డిసాయి ఆలయం వద్ద, చిన్న శివాలయం, జువ్వలపాలెం పురాతన శివాలయం, పట్టణంలోని ఇతర శివాలయాలను శివరాత్రి పురస్కరించుకుని విశేషంగా అలంకరణలు గావించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



రూపాంతర దేవాలయ యూత్ సభ్యులతో దైవ సేవకులు జర్మియా

పెంటపాడు: క్రీస్తు మార్గం అనుసరణీయమని, విశ్వాసులకు ఆధ్యాత్మిక అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్‌కు చెందిన అంతర్జాతీయ ప్రసంగీకులు పాస్టర్ బి. జెర్మీయా పేర్కొన్నారు. రాచర్ల రూపాంతర దేవాలయ ఆవరణలో హిజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రెండు రోజులనుంచి జరుగుతున్న ఓపెన్ లైఫ్ ఆధ్యాత్మిక సమావేశాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్త, రూపాంతర దేవాలయ నిర్మాణకులు మానుకొండ మార్కు, సంఘ కాపరి స్వప్న ఎడ్వర్డ్స్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాలలో జర్మియా మాట్లాడుతూ దేవుని నమ్ముకొనే వారి కన్నా యేసుక్రీస్తులోని సుగుణాలను అనుసరించి, ఇతరులకు మాదిరిగా నడిచే వారు ఎంతో ధన్యులన్నారు. ఈ సందర్భంగా జర్మియా రోగుల కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన మరో దైవసేవకులు బ్రదర్ ప్రవీణ్ పగడాల దేవుని వాక్యం బోధించారు. రాచర్ల రూపాంతర దేవాలయ సంఘ యూత్ సభ్యులు, పలు గ్రామాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలన్నారు. శాసన సభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం, ఏరియా ఆసుపత్రి సిబ్బందికి బకాయిలు విడుదల చేయాలని, పీఎఫ్, ఇఎస్ఐ సమస్యల పరిష్కారం, సిబ్బందిని పెంచాలన్నారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరణ విషయంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేయడం తగదని హెచ్చరించారు. డి.సోమసుందర్, తాడికొండ శ్రీనివాసరావు, కళింగ లక్ష్మణరావు, అంకం భాస్కరరావులు పాల్గొన్నారు.

మారంపల్లిలో రామలింగేశ్వరస్వామి కల్యాణం

తాడేపల్లిగూడెం రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మారంపల్లి గ్రామంలో రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్ ప్రసాద్ బ్రహ్మత్వంలో మంగిన బాలాజీ– విజయ దంపతులు పీటలపై కూర్చొని ఈ క్రతువు జరిపారు. ఆలయ నిర్వాహకులు తోట సూర్యనారాయణ, గొట్టుముక్కల నాని, దూలం వర్మ, తోట మునీశ్వరరావు, రామిశెట్టి సత్తులు, సారిక వెంకట్రావు, సారిక శ్రీను, రేఖా వెంకటేశ్వర్లు, దూలం మాణిక్యం, శోభన్‌బాబు, శ్రీమంతుల వెంకటేశ్వరరావు, టీకు సత్యనారాయణ, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారత రాజ్యాంగమే ఎస్సీలకు రక్ష



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత రాజ్యాంగమే ఎస్సీలకు రక్ష అని దానిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ కర్నూల్‌లో జరిగిన రాయలసీమ మాలల మహాగర్జనలో వేలాది మంది పాల్గొని విజయవంతం చేశారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మాలలు ఇలా సంఘటితంగా ఉండి ఉద్యమించినప్పుడే హక్కులు సాధించుకుంటామని తెలిపారు. మాలలను అణగదొక్కాలని వర్గీకరణ చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి మాలలకు వ్యతిరేకంగా పనిచేస్తారని, అప్పుడు ఇప్పుడు వర్గీకరణకు సూత్రదారి చంద్రబాబే అన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా చేసే ఎస్సీ వర్గీకరణను న్యాయ బద్ధంగా అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో నాయకులు తిరగటి శివ, నర్సమయ్య, సుంకర ప్రియబాబు, ఏసురత్నం, ప్రేమ్‌కుమార్, రమణ, ఎం.శ్రీను, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.